# స్నేహితుడా మిత్రా

-భమిడిపాటి సోమయాజి

వేణుగోపాలస్వామి గుళ్లో అర్చన చేయించి గుడి మెట్లు దిగుతున్నారు అర్చన, ఆనందరావు దంపతులు. "ఈ మెట్టుమీద కూర్చుని కొంచెం ప్రసాదం తిని వెళదాం'' అంది అర్చన.

"మన అమ్మాయికి పెళ్లికి కావాల్సిన డబ్బు సమకూరాలని భగవంతునికి దణ్ణం పెట్టుకుంటున్న సమయంలో 'మనోవాంఛాఫల సిద్ధిరస్తు' అంటూ నా శిరస్సుపై శఠగోపం పెట్టి ఆశీర్వదించారు పూజారిగారు. మీరేం దిగులు పడ కండి. కావాల్సిన డబ్బు ఆ వేణుగోపాలస్వామే ఏర్పాటు చేస్తాడు'' అంది మెట్ల మీద కూర్చుని ప్రసాదం తింటున్న అర్చన.

"సరే అర్చనానంతనం అర్చన చెబితే నాక్కూడా ధైర్యం వస్తుంది.''

"అన్నట్లు మీ చిరకాల మిత్రుడు వేణుగోపాల్‌గారు అమెరికా నుంచి వెనక్కి వచ్చేసారేమో కనుక్కోండి. మీరంటే ఆయనకి చాలా ఇష్టమని చాలాసార్లు చెప్పారు. పైగా చాలా ఏళ్లబట్టీ అమెరికాలో వున్నారుకదా. చాలా డబ్బు సంపాదించి ఉంటారు.''

"బాగా జ్ఞాపకం చేసావు. వాడిని కలిస్తే మన సమస్యలు తీరినట్టే.''

"ఆ వేణుగోపాలస్వామే మీ వేణుగోపాల్‌ని జ్ఞాపకం చేయించాడు'' అంది అర్చన.

ఇంటికి వచ్చిన తరువాత "ఈరోజు ఆది వారం సెలవే కదండీ. మీ ఫ్రెండ్స్ నెవరినైనా కలిసి ఆయన గురించి తెలుసుకోండి.''

"పట్టుకుంటే వదలవు. నేనూ అదే ఆలోచిస్తు న్నాను'' అన్నాడు ఆనందరావు.

ఆ ఆదివారమంతా తిరిగి తిరిగి వేణుగోపాల్ ఢిల్లీలో వున్నట్లు తెలుసుకున్నాడు ఆనందరావు. ఇంటి అడ్రస్, ఫోన్ నెంబర్ కూడా సంపాదిం చాడు ఓ మిత్రుని ద్వారా.

"అర్చన చేయించిన రోజు ఎంతో శుభ మండీ. అందుకనే ఒక్కరోజులో ఆయన ఎక్క డ్నునదీ అడ్రస్‌తో సహా తెలుసుకోగలిగారు.''

"అది సరే. ఎంత డబ్బు అడగమంటావ్?''

"ఓ యాభైవేలు అడగండి. ఓ మూడేళ్లల్లో మీరు రిటైర్ అవుతారుకదా. అప్పుడు మళ్లీ ఇచ్చే స్తానని చెప్పండి. ముందొకసారి ఫోన్ చేసి మాట్లాడండి.''

"ఈ డబ్బు విషయాలు ఫోన్‌లో మాట్లాడితే ఏం బావుంటుంది? నేనే స్వయంగా వెళ్లి సము ఖంలో మాట్లాడతాను. అవునూ... ఈ గెడ్డం పెంచుకున్నానుకదా. వాడా పెద్ద పొజిషన్‌లో ఉన్నాడు. ఇలా వెళితే బావుంటుందంటావా?''

"అయ్యో అపచారం... ఆ ఆపదల మొక్కుల వాడికి మొక్కుకున్న గడ్డం వికారంగా ఉందేమో అనుకోడం కూడా తప్పండి. చెంపలేసుకోండి'' అంది తను కూడా చెంపలేసుకుంటూ.

"సరే సరే ఆవేశపడకు'' అని తను కూడా చెంపలేసుకున్నాడు.

***

ఢిల్లీ వెళ్లాడు. వేణుగోపాల్ నివాసముంటున్న ఇంటికి వెళ్లాడు. చాలా పెద్ద ఇల్లు. ఇంటిముందు ఓ పెద్ద లాన్. ఆ లాన్‌లో ఓ బంగారపు ఛాయ గల ఒకావిడ పేపర్ చదువుకుంటోంది.

గూర్ఖా వెళ్లి ఎవరో వచ్చారని ఆమెతో చెప్పాడు. "ఎవరో కష్టాల్లో ఉన్నాడనుకుం టాను. ఆ గెడ్డం చూస్తేనే తెలుస్తోంది. డబ్బుకో సమైే వుంటుంది'' అని హిందీలో ఆ గూర్ఖాతో అన్న మాటలు ఆనందరావు చెవినపడ్డాయి.

ఆనందరావు హిందీ నేర్చుకున్నందుకు చాలా బాధపడ్డాడు. హిందీ నేర్చుకుంటే ఆఫీ స్‌లో ఇంక్రిమెంట్ వస్తుందని నేర్చుకున్నాడు. విద్యకి వచ్చే ప్రతిఫలం కంటే దుఃఖమే ఎక్కువని మొదటిసారి తెలుసుకున్నాడు. ఆమె మెల్లగా చెప్పిన మాటలు అతని చెవినపడ్డాయి.

ఆ లాన్‌లో మెల్లగా నడుస్తూ ఆమెని సమీపిం చాడు ఆనందరావు.

"నేనూ, వేణుగోపాల్‌గారు కలిసి చిన్న ప్పుడు హైస్కూల్‌లో చదువుకున్నాం. ఓసారి కలుద్దామని వచ్చాను'' అన్నాడు ఆమెతో ఆనం దరావు. అతని చేతిలోవున్న శుభలేఖను చూసి 'విషయం అర్థమయింది' అనుకుంది ఆవిడ.

"సార్ కోసం ఎవరో వచ్చారని చెప్పు'' అని గూర్ఖాని పంపించింది.

చిన్నప్పుడు 'ఏరా వేణు... వెధవ...' అని పిలి చేవాడ్ని. 'వేణుగోపాల్‌గారూ, నేనూ కలిసి చదు వుకున్నాం' అని చెప్పవలసి వచ్చినందుకు మన స్సులో బాధపడ్డాడు ఆనందరావు. అసలు తనని కూర్చోమని కూడా చెప్పనందుకు మరింత బాధ పడ్డాడు.

"మీరు కూర్చోండి. నేను లోపలకు వెళ్లి ఆయన్ని పంపిస్తాను'' అని అందావిడ.

కాసేపటికి విలాసంగా ఓ ఫుల్‌సూట్‌లో వచ్చాడు వేణుగోపాల్. వస్తూనే 'మీరెవరన్నట్లు' చూసాడు.లోపల్నుంచి వస్తూనే తనని గుర్తుపట్టి "రారా లోపలికి'' అంటూ సాదరంగా ఇంట్లోకి తీసుకువెళ్తాడని ఊహించుకున్న ఆనందరావు మనస్సులో నల్లని మేఘాలు ప్రవేశించాయి.

లేచి నిలబడి "మీరు నన్ను గుర్తుపట్టలేదను కుంటాను. చిన్నప్పుడు మనం కలిసి చదువు కున్నాం. నా పేరు ఆనంద్'' అన్నాడు.

"ఓ... ఎక్కడ చదువుకున్నాం'' అన్నాడు విలాసంగా వేణు.

"రాజమండ్రి'' అన్నాడు.

"ఓ సారీ... అప్పటి విషయాలు నాకంతగా గుర్తులేవు. ఏమనుకోకండి'' అన్నాడు వేణుగో పాల్.తనని మర్చిపోయానని అతనన్న మాటలు విని స్థాణువయ్యాడు ఆనందరావు.'స్నేహితుల్లో కూడా ఇటువంటి వెధవలు కూడా ఉంటారా?' అని అనుకున్నాడు.

"ఢిల్లీకి ఏం పని మీద వచ్చారు?'' అని అడి గాడు వేణుగోపాల్.

"ఏం పనిలేదు. ఈ శుభలేఖ మీకు స్వయంగా ఇద్దామని వచ్చాను..''


"సో నైస్ ఆఫ్ యూ. మళ్లీ కలుద్దాం. థాంక్యూ ఫర్ ది విజిట్. మాయా డార్లింగ్! థంక్ష

న్‌కి టైమ్ అవుతోంది. తొందరగా రా'' అని సెల్ ఫోన్‌లో తన భార్యని పిలిచాడు.

'వీడి శరీరంలో సగ భాగం ఐశ్వర్యం అనే మాయలో నిండిపోయింది. మిగిలిన సగ భాగాన్నీ మయ పేరుగల వీడి అర్థాంగి కమ్మేసింది. అలా మాయా పరిపూర్ణుడు అయ్యాడు అనుకున్నాడు ఆనందరావు.

***

తిరుగు ప్రయాణానికి రైలెక్కిన ఆనందరావు మనస్సు గతంలోకి వెళ్లింది. ఓసారి ఎక్స్‌కర్షన్‌కి వెళ్లేటప్పుడు తనకున్న ఒకే ఒక మంచి జత బట్టలు వేణుగోపాల్‌కి ఇచ్చి తను సాదాసీదా బట్టలేసుకున్నాడు. 'స్నేహమంటే నీదేరా. నా జీవితంలో నిన్ను ఎప్పుడూ మరువను' అన్న వేణు మాటలు జ్ఞాపకం వచ్చాయి ఆనందరావుకి.



వేణుగోపాల్ తల్లికి ఒంట్లో బాగా లేనప్పుడు తన కారియర్ భోజనమే ఇద్దరూ తినేవారు. వీళ్ల స్నేహం చూసి చాలామంది అసూయపడేవారు. ఇద్దరూ బీదస్థితిలోనే చదువుకున్నారు. వేణు అదృష్టం బాగుండి అతని మేనమామ పై చదువులు చదివించాడు. ఆనందరావు పెద్ద చదువులకు వెళ్లలేకపోయాడు. ఈ విషయాలన్నీ మదిలో మెదిలిన ఆనందరావు తను కూడా పెద్ద చదువులు చదువుకోలేకపోయినందుకు చాలా బాధపడ్డాడు. అసలు వేణు భార్య ఇంట్లోకి వెళ్లి 'ఎవడో గెడ్డంతో వున్నతను వచ్చాడు. ఎలాంటి ధన సహాయం చేయకండి. అసలు అతనెవరో తెలీనట్లు, జ్ఞాపకమే లేనట్లు నటించమని చెప్పిందేమో అన్న అనుమానం కలిగింది.

'అంతా మాయ. అసలు ఆవిడ చెప్పినంత మాత్రాన ఈ వెధవ చిలక పలుకులు పలకడం ఎందుకు? పైగా పెద్ద ఇంగ్లీషొకటి? అసలు నా ఇంగ్లీషు నోట్స్ చూసి కాపీ కొట్టేవాడు. అసలు నేనెవరో తెలీనట్లు నటిస్తే నమ్మేస్తాననుకున్నాడు. నేనేం చిన్నపిల్లవాడినా? అనుకున్నాడు ఆనందరావు.

***

హైదరాబాద్ తిరిగి వచ్చిన ఆనందరావును అర్చన అడిగింది. "ఏమండీ! ఏమన్నారు మీ ఫ్రెండ్? మిమ్మల్ని చూడగానే గుర్తుపట్టాడా? మీరుండడానికి ప్రత్యేకంగా గది ఇచ్చి ఉంటారు. ఈ చిన్నప్పటి విషయాలు నెమరువేసుకోవడంలో నన్ను కూడా మర్చిపోయుంటారు''

"వుండు మాట్లాడదాం. తలనొప్పిగా ఉంది. ముందొక స్ట్రాంగ్ కాఫీ ఇయ్యి''

ఆమె కాఫీ తెచ్చేలోపు 'అసలు ఇన్నాళ్లూ తమ స్నేహం గురించి బాగా చెప్పి ఇప్పుడు జరిగిన విషయాలు చెబితే తన భార్య దృష్టిలో చులకన అయిపోతానన్న భయం కలిగింది ఆనందరావుకి. అర్చన కాఫీ ఇస్తూ "మరి డబ్బు ఇస్తానన్నారా మీ ఫ్రెండ్?'' అని అడిగింది.

"నేను ఢిల్లీకి వెళ్లేసరికి వాడు అందుబాటులో లేకుండాపోయాడు. డబ్బు గురించి కంగారుపడకు. ఆపదమొక్కులవాడుసహాయం చేస్తాడు.''

"మీకు లేని కంగారు నాకెందుకు? స్నానం చేసి రండి. శుభలేఖలు ఇవ్వడానికి వెళదాం.''

"శుభం'' అన్నాడు ఆనందరావు.

ఆనందరావు స్నానానికి వెళ్లి పూజ పూర్తి చేసుకుని వచ్చేలోగా ఫోన్ వచ్చింది. పూజ గది లోంచి వచ్చిన ఆనందరావుతో చెప్పింది అర్చన.

"మీరు శుభం అని ఏ ముహూర్తాన అన్నారో గానీ తథాస్తు దేవతలు తథాస్తు అన్నట్టున్నారు. మా పెద్దక్కయ్య, మా బావగారికి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందాయని చెప్పింది. డబ్బు సర్దుబాటు చేస్తానన్నారు. మొక్కులు, పూజలు ఎప్పుడూ వృథా పోవండీ. మనమ్మాయి పెళ్లి కష్టపడకుండా మనంచేయగలం'' అంది అర్చన.

మళ్లీ "శుభం'' అన్నాడు ఆనందరావు.

"తథాస్తు'' అంది అర్చన.

పెళ్లి శుభప్రదంగా, ఘనంగా జరిగింది.

★